పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

తవణంపల్లె: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం మండలంలోని టి.పుత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ పురుషోత్తం, ఆర్థో డాక్టర్ పవన్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్ పాల్గొని, 348 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 43 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. అనంతరం వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు జగనన్న ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కవితారాణి, లక్ష్మీపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, పాలాక్షిరెడ్డి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: పేద, సామాన్య ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరమని పీహెచ్‌సీ వైద్యాధికారులు సంధ్య, మహేష్ తెలిపారు. మంగళవారం 189కొత్తపల్లె సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం 307 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



టి.పుత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగనన్నతోనే ఉచిత వైద్యం

పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మంగళవారం మండలంలోని ఎం.బండపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌నకు వచ్చిన ప్రజలకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత క్యాంప్ విజయవంతం కావడంతో రెండో విడతను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ క్యాంప్ ద్వారా ప్రజలకు మరింత సేవను చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జ్యోతి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి హేమలత, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని వైద్యాధికారి డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని అరుణానగర్ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనం ద్వారా 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



పూతలపట్టు: రోగిని పరీక్షిస్తున్న వైద్యధికారి



ఐరాలలో మందుల పంపిణీ

శ్రద్ధగా చదవండి

– జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు

పూతలపట్టు: పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులందరూ సన్నద్ధం కావాలని సూచించారు. కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. పరీక్షల కాలంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఉల్లాసాలకు దూరంగా ఉండి జ్ఞాపక శక్తితో అర్థం చేసుకుని చదువుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందుగా మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న టెట్ పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ దేవరాజు

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐరాల/బంగారుపాళెం: ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐరాల, బంగారుపాళెం ఎంఈఓలు రుషేంద్రబాబు, నాగేశ్వరరావు తెలిపారు. ఐరాల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మంగళవారం ఎంఈఓ రుషేంద్రబాబు ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని నిర్ణయించిందని, ఇందుకు గాను మార్చి 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐదేళ్లు నిండిన పేద పిల్లలను ఒకటవ తరగతిలో చేర్చుకుంటామన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబానికి వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల లోపు ఉండాలని చెప్పారు.

7 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని ఎగువ కన్నికాపురం సమీపంలోని శ్రీమరకతవల్లీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మార్చి 7వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సంబంధించి 7న ధ్వజారోహణం, రుద్రహోమం, 8న స్వామివార్ల కల్యాణోత్సవం, అభిషేకాలు, విశేష పూజలు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండలంలోని భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. స్థానికులు గణపతిరెడ్డి, దయాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌స్వామి

పుత్తూరు ఆస్పత్రిలో సౌకర్యాలు భేష్

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాల పట్ల క్వాలిటీ అసెస్‌మెంట్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి సంతృప్తి వ్యక్తం చేశారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం సాయంత్రం పుత్తూరు ఆస్పత్రిని రాష్ట్ర అధికారుల బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. క్యాజువాలిటీలో అందుతున్న సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కన్సల్టెంట్ కె.రాజ్‌కిరణ్, జిల్లా ఎస్ఎస్ఆర్ హరికృష్ణ, స్థానిక వైద్యాధికారి డాక్టర్ జి.కృష్ణకాంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



క్యాజువాలిటీని పరిశీలిస్తున్న రమాదేవి

హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో మంగళవారం సాయంత్రం కళాజాత బృందం సభ్యుల ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్ ఎన్‌జీఓ కళాబృందం సభ్యులు మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీకి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, కళాబృందం మేనేజర్ సద్దాం, డీపీఎంఓ మణి, సీహెచ్‌ఓ రాజామణి పాల్గొన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట పంచాయతీలో ఉన్న చెరువులను చేపల పెంపకం కోసం వేలం వేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ భువనేశ్వరి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలోని పాతగుంట చెరువు, ఉప్పరపల్లె చెరువు, నారాయణ, ముత్యాలనాయుడు చెరువుల్లో చేపల పెంపకం కోసం బుధవారం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు రూ.3 వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నేడు పుత్తూరు మార్కెట్ వేలం

పుత్తూరు: పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, జంతువధశాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించే వేలంపాటలో పాల్గొనేవారు గెజిట్ 90/2024 నియమ నిబంధనలు, షరతులకు లోబడి పాల్గొనాలని సూచించారు. వేలం నెగ్గిన వారు పురపాలక సంఘం నిబంధనలకు మేరకు రుసుం వసూలు చేయాల్సి ఉంటుందన్నారు.

తడి,పొడి చెత్త వేరు చేయడంపై శిక్షణ



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయడంపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తామని, వ్యర్థాల నిర్వహణలో ఈ ప్రక్రియ ఎంతో కీలకమని నగర కమిషనర్ జె.అరుణ తెలిపారు. మంగళవారం ఉదయం నగరపాలక కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కమిషనర్ మాట్లాడారు. వ్యర్థాలను వేరు చేయడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని, ఇందు కోసం దశల వారీగా శిక్షణ ఇస్తామని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యర్థాలను సేకరించే స్థలంలోనే తడి, పొడిగా సేకరించే పనులను పకడ్బందీగా పట్టాలన్నారు. తడి, పొడిగా వేరు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను, చేయకపోతే కలిగే నష్టాలను వివరించారు. తడి, పొడి వ్యర్థాలను ఇంటి వద్దనే వేరు చేసి అందించేలా గృహస్తుల్లో కూడా చైతన్యం తెస్తామని తెలిపారు. అనంతరం షెడ్డులోని క్లాప్ ఆటోలను కమిషనర్ పరిశీలించారు. క్లాప్ ఆటోల నిర్వహణను పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని, నాణ్యమైన శుచి, శుభ్రమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. మండలంలోని బాలగంగానపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, హాజరు పట్టికను పరిశీలించి, చాలా బాగుందని అభినందించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులతో మమేకమై త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి ?పరీక్ష హాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి బాగుందని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- రేపే అంకురార్పణ
- మార్చి 8వ తేదీ వరకు వాహన సేవలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి తొమ్మిది రోజుల పాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులను దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. అలంకార మండపం, నాలుగు మాడవీధులలో రంగవల్లులను తీర్చిదిద్దారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్ కటౌట్లు

శ్రీకల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్వామి, అమ్మవారి చిత్రాలు, స్వామివారి దశావతారం, శంఖుచక్ర నామాల విద్యుత్ కటౌట్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మార్చి 8వ తేదీన ఉదయం నిర్వహించే చక్రస్నాన ఘట్టం కోసం శ్రీవారి పుష్కరిణిని సిద్ధం చేశారు. దేశ విదేశాల నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పుష్పాలను స్వామివారి ఆలయంలో అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా ఆలయ గోపురం, పుష్కరిణి

వాహన సేవల వివరాలు

29వ తేదీన ఉదయం – ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహనం, మార్చి 1వ తేదీన ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 2న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 3న ఉదయం కల్పవక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 4న ఉదయం పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం), రాత్రి – గరుడ వాహనం, 5న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహనం, 6న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 7న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 8న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహించనున్నారు.



ఆలయ ప్రవేశ మార్గంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణలు

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు

నగరి : నాడు–నేడు పథకంలో ఆధునీకరించిన మండలంలోని ఎం.కొత్తూరు పాఠశాలలో మరిన్ని అభివృద్ధి పనులకు పీఎంశ్రీ పథకంలో రూ.15 లక్షలు మంజూరైంది. ఈ నిధులతో పాఠశాల మైదానం, సైన్స్ ల్యాబ్ తదితర పనులు జరగనున్నాయి. మంగళవారం సంబంధిత పనుల విషయమై సర్వశిక్షా అభియాన్ డీఈ మధుసూదనరావు, ఏఈ నాగభూషణం పాఠశాలకు విచ్చేసి మైదానాలను పరిశీలించారు. మంజూరైన నిధులతో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ నమశ్శివాయం, హెచ్ఎం హిమవతి, పీఈటీ వేలు తదితరులు పాల్గొన్నారు.



మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జాబ్ మేళాలో 65 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ: బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 117మంది అభ్యర్థులు పాల్గొనగా, 65మంది ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాల యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు. ప్రతి నెలా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం పాల్గొని ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించారు.

కేంద్ర బలగాలకు వసతి ఏర్పాట్లు

తిరుపతి క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే కేంద్ర సాయుధ బలగాలకు ఎస్వీ యూనివర్సిటీ హెచ్ బ్లాక్‌లో కల్పిస్తున్న వసతి ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ పరిశీలించారు. ఎన్నికలు ముగిసే వరకు సాయుధ బలగాలకు వసతిని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

ఘనంగా శాంతి ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో 11 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ద్వాదశి హారతులు ఇచ్చారు. శాంతి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

షాపుల వేలం రేపు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానానికి సంబంధించిన పది షాపులను గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తిగలవారు ఈ వేలంలో పాల్గొన వచ్చని ఆయన పేర్కొన్నారు.

3న పల్స్‌పోలియో

గుడిపాల: మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు సంధ్య, మహేష్ అన్నారు. మంగళవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల వయస్సులోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను తప్పక వేయించాలన్నారు. ప్రయాణంలో ఉన్న వారి పిల్లలకు బస్టాండ్లలో, రోడ్డు పనులు చేస్తున్న వారి పిల్లలు, పొలాలు, భవన నిర్మాణాలు జరిగే చోట, క్వారీలలో పని చేసే వారి పిల్లలను గుర్తించి ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆ రోజున వేయించుకోని వారికి మార్చి 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. సీహెచ్‌ఓ నరసింహమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ విద్య పాల్గొన్నారు.

హాల్ టికెట్ల పంపిణీ



హాల్ టికెట్లు అందుకున్న విద్యార్థులు

గుడిపాల: బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ మంగళవారం హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



సూచనలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

చిత్తూరు రూరల్: పది పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించి విద్యార్థుల మెదడుకు పదును పెట్టాలని డీవైఈఓ చంద్రశేఖర్ సూచించారు. చిత్తూరు మండలం తాళంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పాఠ్యాంశాల బోధనను పరీక్షించారు. అనంతరం హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పది పరీక్ష విషయాలపై సూచనలు ఇచ్చారు.

నీతిశాస్త్రంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మురకంబట్టులోని అపోలో మెడికల్ కళాశాలలో మంగళవారం నీతిశాస్త్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి వైద్య వృత్తిలో పాటించాల్సిన నియమాలు, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

భక్తిప్రపత్తులతో రాహు కేతు పూజలు



మయూర వాహనంపై సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం రాహుకేతు మండపంలో రాహు కేతు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కర్ణాటక భక్తులు సుబ్రమణ్యస్వామి వారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. సుబ్రమణ్యస్వామి వళ్లీదేవసేన సమేతుడై మయూర వాహనంపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సాయంత్రం భక్తులు స్వామివారికి కావడులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.